# మద్యం మత్తులో యువకులపై దాడి






- **పాల చెట్టు ఏరియాలో ఉద్రిక్తత**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియాలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. చిన్నపాటి మాటామాటలు తీవ్రంగా మారి, ఇద్దరు యువకులపై కొందరు యువకులు మద్యం మత్తులో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం 8.30 గంటల సమయంలో ఆటోలో వచ్చిన విద్యానగర్‌కు చెందిన ఆరుగురు యువకులు అక్కడ బైక్‌పై వెళ్తున్న పచ్చిక రవితేజ, బండ రాకేష్‌లతో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత కోపావేశంతో కర్రలు, రాళ్లతో ఇద్దరిపై దాడి చేశారు. ఈ దాడిలో రవితేజ తలకు గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నిందితులుగా జిల్లపల్లి ఆకాష్ @ బన్నీ, కోట మహేష్, రెండ్ల శ్రీకాంత్, దానబోయిన నవీన్ కుమార్, పులి సతీష్, ఆకాష్ స్నేహితుడు (పేరు తెలియనివ్యక్తి)ల పేర్లు వెలుగులోకి వచ్చాయి.

**అరెస్టులు, పరారీలో ఇద్దరు**

ప్రధాన నిందితుడు ఆకాష్, అతని స్నేహితుడు పరారీలో ఉండగా, మిగిలిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, నేరప్రవృత్తి ప్రదర్శించే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కూడా విధిస్తామని సీఐ శశిధర్ రెడ్డి హెచ్చరించారు.

# కాంప్రమైజ్ అవ్వండి?





- **ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటూ మహిళా జీపీ కార్యదర్శిపై ఒత్తిళ్లు**
- **అధికార, ప్రతిపక్ష నాయకుల నుంచి ఫోన్లతో ఇబ్బందులు**
- **లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం దేవులవాడ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ రామకృష్ణపై మహిళా కార్యదర్శి చేసిన ఫిర్యాదు చుట్టూ వివాదం నెలకొంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదు చేసిన తరువాత కొంత మంది అధికార, ప్రతిపక్ష నాయకులు ఫోన్ చేసి ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు ఇటీవల దేవులవాడ సబ్‌స్టేషన్‌లో విచారణ జరిపి, ఆ నివేదికను ఎస్ఈ కార్యాలయానికి సమర్పించినట్టు విజిలెన్స్ అధికారి రాజేశ్వర్ తెలిపారు. వారం గడిచినా లైన్‌మెన్‌పై చర్యలు లేకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కొంత మంది అధికారులు, సదరు యూనియన్ ప్రతినిధులు రామకృష్ణకు మద్దతుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కొమ్మెర సబ్‌స్టేషన్‌లో పని చేసే సమయంలో కూడా రామకృష్ణ వైఖరిపై ఓ మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ సమ యంలో స్థానిక నాయ కుల జోక్యంతో ఆయనను బదిలీ చేసినట్లు తెలిసింది. తాజాగా బాధితురాలు మొదట ఏఈకి ఫిర్యాదు చేయగా "తాను అందుబాటులో లేను, తమ డిపార్ట్‌మెంట్ నుంచి వస్తున్న వ్యక్తి ఇవ్వండి" అని సూచించారని, రెండు మూడు రోజులు గడిచినా స్పందన రాకపోవడంతో డీఈని సంప్రదించగా "ఇది వ్యక్తిగత విషయం" అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. చివరికి నేరుగా మంచిర్యాల ఎస్ఈ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు సమర్పించాల్సి వచ్చిందని వివరించారు. ఫిర్యాదు అనంతరం సంఘ నాయకులు, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఫోన్ ద్వారా ఒత్తిడి తెస్తున్నారని ఆమె తెలిపింది. లైన్‌మెన్‌పై ఎస్ఈ కార్యాలయం తీసుకోను న్న చర్యలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



నస్పూర్ న్యూ నాగార్జున కాలనీలో శుక్రవారం దుర్గాదేవి శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవరాత్రులు ఒక్కో అవతారంలో భక్తులకు దుర్గాదేవి దర్శనమిచ్చింది. శ్రీ విజయ కనక దుర్గా భక్త మండలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు నూతి వెంకటా చార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం, అమ్మవారి చీరలకు, శ్రీచక్రానికి వేలం నిర్వహించారు.

**ఆకట్టుకున్న కోలాటాలు, నృత్యాలు...**

మహిళల కోలాటాలు, యువకుల నృత్యాలు, డబ్బు చప్పుళ్లు, డీజే సౌండ్ల మధ్య అమ్మవారి శోభయాత్ర కన్నుల పండువగా సాగింది. ఆధ్యాంతం అమ్మవారి యాత్ర ఆకట్టుకుంది. యాత్రలో అమ్మవారి రథానికి భక్తులు నీళ్లు చల్లి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలు దుర్గాదేవి అమ్మవారిని గొప్పగా కొలుస్తారు. సింగరేణి కార్మికులు మంగళ హారతులతో అమ్మవారికి స్వాగతం పలుకుతూ శోభ యాత్ర వెంట నడిచారు. భవాని మాల వేసిన భక్తులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. అనంతరం సమీప గోదావరి నదీ తీరంలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.



## గన్నేరువరం మండల కేంద్రం నుంచే బ్రిడ్జి నిర్మాణం



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల కేంద్రంలో శుక్రవారం బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు పుల్లెల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా కేంద్ర హోంవిభాగ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేసిన సమయంలో బ్రిడ్జి నిర్మాణ అంశాన్ని గుర్తు చేశామని తెలిపారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించి, గన్నేరువరం మండల కేంద్రం నుంచే బ్రిడ్జి నిర్మాణం తప్పనిసరిగా చేయిస్తానని, ఇందుకోసం అవసరమైన నిధులను కేంద్రం నుండి తెప్పిస్తానని హామీ ఇచ్చారని ఆయన వివరించారు. స్థానిక ఎన్నికలు పూర్తైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని, గన్నేరువరం మండల ప్రజలు కరీంనగర్‌కు ప్రయాణించేందుకు అనువైన ప్రాంతం నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపడతామని బండి సంజయ్ తెలిపారు అని జగన్‌మోహన్ వెల్లడించారు. బండి సంజయ్ గన్నేరువరం అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి మండల ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రిడ్జి జేఏసీ సభ్యులు పుల్లెల రాము, సంధె వేణి ప్రశాంత్, మీసం లక్ష్మణ్, మునిగంటి లింగయ్య, జీల ఎల్లయ్య, బుర్ర మల్లయ్య, కవ్వంపెల్లి శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీరామ్ శ్రీనివాస్, దుంబాల రామస్వామి, బుర్ర శ్రీనివాస్, కాల్వ రాకేష్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రూప్స్ విజేతలకు సన్మానం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ఇటీవల విడుదలైన గ్రూప్–1, గ్రూప్–2 ఫలితాల్లో మండలంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన సీత లక్ష్మి–కొమురయ్య దంపతుల కుమారులు సీత వెంకటేష్, హరికృష్ణ ప్రతిభ కనబరచి ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. పెద్ద కుమారుడు వెంకటేష్ గ్రూప్–1 ద్వారా జిల్లా స్థాయి ఆడిట్ అధికారి ఉద్యోగానికి, చిన్న కుమారుడు హరికృష్ణ గ్రూప్–2 ద్వారా సెక్రటేరియట్‌లో సాధారణ పరిపాలన విభాగం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పూర్వ ప్రైవేట్ ఉపాధ్యాయుడు చెప్యాల సంతోష్ కుమార్, విజయాలు సాధించిన వెంకటేష్, హరికృష్ణ, వారి తల్లిదండ్రులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తరువాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ, "వెంకటేష్, హరికృష్ణ ఇద్దరూ స్పష్టమైన లక్ష్యంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నారు. పట్టుదల, అంకితభావం ఉంటే ఏ అడ్డంకినైనా అధిగమించవచ్చు. నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలి" అని సూచించారు.



## దుర్గామాతకు 640 నైవేద్యాల సమర్పణ

**సిరికొండ, అక్టోబర్ 3 :**

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం న్యావనంది గ్రామంలోని మహాదేవుని ఆలయంలో దసరా వేడుకలను పురస్కరించి భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతకు మొత్తం 640 నైవేద్యాలను సమర్పించడం విశేషం. భక్తులు ఆధ్యాత్మిక ఉత్సాహంతో, శ్రద్ధాభక్తులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆల య కమిటీ సభ్యు లు ప్రతీ ఏడాది నైవేద్య సమర్పణను కొనసాగిస్తూ వస్తున్నా మని తెలిపారు. మహిళలు ప్రత్యేకంగా వంటవండుతూ నైవేద్యాలను సిద్ధం చేయగా, యువతులు, పిల్లలు దేవి భక్తి గీతాలు పాడి కార్యక్రమానికి అందాన్ని చేకూర్చారు.

## మంచిర్యాల ఠాణాలో
# విజయదశమి పూజలు



- **విజయాలు అందరికీ చేకూరాలని ఆకాంక్ష**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

విజయదశమి పండుగ అందరికీ విజయాలను అందించాలనే ఆకాంక్షతో మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ ఆర్. ప్రకాష్ మాట్లాడుతూ... దసరా పండుగ చెడుపై మంచికి సంకేతమని చెప్పారు. దుర్గామాత పూజలతో ప్రారంభమైన ఈ వేడుకలో ప్రతి ఆయుధానికి శక్తి లభిస్తుందని, పోలీస్ శాఖ ప్రజా రక్షణలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో చెడును తరిమికొట్టే బాధ్యత పోలీసులు భుజాన వేసుకున్నారని వివరించారు. అనంతరం వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రమోద్ రావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దసరా వేడుకల్లో దిల్ రాజు



**నిజామాబాద్ , అక్టోబర్ 3 :**

ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు తన సొంత గ్రామమైన నర్సింగ్ పల్లి గ్రామంలో గురువారం ఆలయం, ఇందూరు తిరుమల గోవింద వనమాలక్షేత్రంలో జరిగిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. దిల్ రాజు ఊరిలోని మిత్రులు, బంధువులతో కలసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. "తాము ఎంత బిజీగా ఉన్నా, ఎక్కడ ఉన్నా, దసరా రోజు తప్పకుండా తమ సొంత గ్రామమైన నర్సిం గ్ పల్లికి వస్తాము. గ్రామాల్లోనే నిజమైన భారతదేశం ఉంది, గ్రామాల్లోనే ఆత్మ ఉంది. మా గ్రామానికి వచ్చే ప్రతిసారి చాలా సంతోషంగా ఉంటుంది" అన్నారు. కార్యక్రమంలో దిల్ రాజు దంపతులతో పా టు ఆలయ ప్రధాన ధర్మకర్త నరసింహా రెడ్డి దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు సంపత్ కుమార్ ఆచార్య, రోహిత్ కుమార్ ఆచార్య, విజయ్ స్వామి, అనిల్ స్వామి, నరాల సుధాకర్, నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపిటిసి రాములు, ప్రసాద్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.